నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 26 మే 2025 | KHAMMAM

# క్రీడలతో మానసికోల్లాసం


ఐటీడీఏ పీవో విన్నర్స్ జట్టుతో పీవో రాహుల్

### భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్

పాల్వంచ రూరల్, మే 25 : నిత్యం పని ఒత్తిడితో తలమునకలయ్యే ఉద్యోగులకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. కిన్నెరసాని మోడల్ క్రీడా పాఠశాల మైదానంలో ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులు, ఏటీడీఏల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పీవో రాహుల్ టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో రోజంతా ఆరోగ్యవంతంగా ఉంటారని, కార్యాలయాల్లో చురుకుగా బాధ్యతలు నిర్వర్తిస్తారని అన్నారు. పీవోగా బాధ్యతలు చేపట్టిన 11 నెలల కాలంలో ఆదివాసీ, గిరిజనుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నానని, వారి పిల్లల విద్యాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. అంతరించిపోతున్న గిరిజన సంస్కృతిని వెలుగులోకి తెచ్చేందుకు ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేశామని, ఆర్గానిక్ ఫుడ్ కూడా ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఐటీడీఏ పీవో టీమ్, ఏటీడీవో జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఐటీడీఏ పీవో జట్టు విజేతగా నిలిచింది. కాగా.. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పీవో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏఎస్‌వో వెంకటనారాయణ, నాగేశ్వరరావు, శంకర్, బాలు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కబీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దందా!

- భద్రాద్రి జిల్లాలో జోరుగా అక్రమ రవాణా
- ఇతర రాష్ట్రాలకు సైతం తరలుతున్న గోదావరి ఇసుక
- అనుమతుల ముసుగులో అక్రమార్కుల జీరో దందా
- లోకల్‌లో కనిపించని 'మన ఇసుక వాహనాలు'
- వాగుల నుంచి రాత్రికి రాత్రే యథేచ్ఛగా రవాణా
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు
- సామాన్యుడికి ఇసుక మరింత పిరం

*భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక దందా జోరుగా సాగుతున్నది. అక్రమార్కులకు కాంగ్రెస్ సర్కారు గేట్లు బార్లా తెరవడంతో ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా వందల ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నది. రాత్రులకు రాత్రులే ఇసుకను జిల్లాలు, రాష్ట్రాలు దాటిస్తున్నారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు తలుచుకుంటే ఎంతటి అక్రమానికైనా పాల్పడొచ్చనే దానికి ఇసుక అక్రమ రవాణే ప్రత్యక్ష నిదర్శనం. గోదావరి నదిలో రీచ్‌లకు అనుమతులు ఉండడంతో అక్కడ జీరో దందాలో ఇసుక దోపిడీ జరుగుతుండగా.. అధికారులకు ముడుపులు ముడుతుండడంతో వాగుల్లో ఇసుక ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా రవాణా జరుగుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత లేకుండా 'మన ఇసుక వాహనాల'కు అనుమతులిచ్చి ఆన్‌లైన్ బుకింగ్ ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు నాయకులకు డబ్బు లు కావాలి.. అధికారులు పరపతి పెంచుకోవాలి.. ఇంకేముంది అంతా దొడ్డిదారిలోనే ఇసుక రవాణా పెద్దఎత్తున జరుగుతున్నది. దీంతో జిల్లాలో ఇసుక పుష్కలంగా ఉన్నప్పటికీ సామాన్యుడికి మాత్రం మరింత పిరం అవుతున్నది.*

*- భద్రాద్రి కొత్తగూడెం, మే 25 (నమస్తే తెలంగాణ)*


మణుగూరులో రీచ్‌ల వద్ద ఇసుకను తోడుతున్న జేసీబీ

### కనిపించని 'మన ఇసుక వాహనాలు'..


గోదావరి ఇసుక సామాన్యులు కొనలేరు. లారీ లోడ్ కొంటేనే తప్ప బుకింగ్ ఉండదు. మరి ట్రాక్టర్ ఇసుక దొరకాలంటే వాగుల్లో ఉండే ఇసుక వాడుకోవాలి. కానీ.. దానికి అధికారిక అనుమతులు లేవు. మరీ ఇసుక ఎట్లా కొనాలి అంటే దొడ్డిదారిన అమ్మేవాళ్ల దగ్గర కొనాల్సిందే. జిల్లావ్యాప్తంగా ప్రతి మండలంలో ఏదో ఒక వాగులో ఇసుక ఉండటం సహజం. అదే అక్రమార్కులకు వరంగా మారుతున్నది. అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి రాత్రిళ్లు ఇసుకను రవాణా చేసుకుంటున్నారు. లక్ష్మీదేవిపల్లిలో ముర్రేడు వాగు, చుంచుపల్లిలో పెనుబల్లి వాగు, పాల్వంచలో కిన్నెరసాని వాగు, టేకులపల్లిలో శంభునిగూడెం వాగు, ఇల్లెందులో మసివాగు, గుండాల, ఆళ్లపల్లిలో ఏడుపాయల వాగులు, ములకలపల్లిలో కిన్నెరసాని వాగు, బూర్గంపాడులో సోంపల్లి వాగుల ద్వారా ఇసుక రవాణా జోరుగా సాగుతున్నది. వాగుల వద్ద నుంచి 'మన ఇసుక వాహనాల'కు అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇసుకకు మరింత డిమాండ్ పెరిగింది.

### గోదావరిపై 23 రీచ్‌లకు అనుమతులు

బడాబాబులు బాగుపడటం కోసం గోదావరి నదిపై జిల్లాలో 23 రీచ్‌లకు అధికారులు అనుమతులు ఇచ్చేశారు. సొసైటీల పేరుతో నడిచే ఈ రీచ్‌లను బడా నాయకులు బినామీలతో నడిపిస్తుండడంతో జీరో దందాకు పాల్పడుతున్నారు. దొరికితే దొంగ.. లేకపోతే దొర అన్నట్లుగా ఇసుక లారీలను రాత్రులకు రాత్రులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. ఇటీవల మణుగూరు మండలంలో ఇసుక సొసైటీల విషయంలో మహిళా సొసైటీల మధ్య పెద్ద రచ్చనే జరిగింది. రెండు సొసైటీల సభ్యులు మాకు కావాలంటే.. మాకు అంటూ కలెక్టరేట్ వద్ద ధర్నాకు కూడా దిగారు. చివరికి రీచ్‌లను నిర్వహించే బినామీలే రంగంలోకి దిగి రాజీ చేసుకుని రీచ్‌లను నడుపుతున్నారు. ఈ తతంగంలో అధికారులు పాత్రదారులుగా.. నాయకులు సూత్రదారులుగా నిలుస్తున్నారు.

### ఇసుక పుష్కలం.. అయినా ఫిరం?


భద్రాద్రి జిల్లాలో గోదావరి నది కిలో మీటర్ల పొడవునా అటు పినపాక నుంచి ఇటు భద్రాచలం వరకు ఇసుక ఉంది. ఇక వాగులు ప్రతి మండలంలో ఏదో ఒకటి పారుతున్నది. అక్కడ ఇసుక తప్పనిసరిగా ఉంటుంది. గోదావరి నది రీచ్‌ల వద్ద ఉన్న ఇసుక హైదరాబాద్, వరంగల్, ఆంధ్రా ప్రాంతాలకు భారీస్థాయిలో తరలిపోతున్నది. ఆన్‌లైన్ బుకింగ్ ఉన్నప్పటికీ బ్రోకర్లు ముందుగానే బుక్ చేసి బ్లాకులో విక్రయాలు చేస్తున్నారు. దీని వల్ల ఈ ప్రాంతం వారికి ఇసుక దొరకడం కష్టంగా ఉంటోంది. వాగుల్లో ఇసుకకు అసలు అనుమతులు లేకపోవడంతో అక్రమార్కులు చెప్పిన రేటుకే సామాన్యుడు ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తుండడం విశేషం.


లక్ష్మీదేవిపల్లి మండలంలోని ముర్రేడు వాగులో అక్రమంగా ఇసుక తోలకం


తెల్లవారుజామున విక్రయానికి తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్


చుంచుపల్లి మండలంలోని పెనుబల్లి వాగులో తెచ్చిన ఇసుకను కుప్పలుగా పోస్తున్న అక్రమదారులు

### గతంలో 'మన ఇసుక వాహనాలు' ఉండేవి..



వాగుల్లో పుష్కలంగా ఇసుక ఉంది. 'మన ఇసుక వాహనాల'కు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం వల్లనే ఇసుకకు డిమాండ్ పెరిగింది. వాగులో ఇసుక కూడా ట్రాక్టర్ నాలుగు వేలు అమ్ముతున్నారు. గోదావరి ఇసుక అయితే మనం కొనలేం. సొసైటీలు పేరుకే.. పెత్తనమంతా బడాబాబులదే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మన ఇసుక వాహనాలు పెట్టడంతో సమస్య ఉండేదికాదు. ఇప్పుడు మళ్లీ ఇసుక కొరత ఏర్పడింది.

**– చారుగుండ్ల వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉద్యోగి, పాల్వంచ**

### రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి..



రాత్రిళ్లు ఇసుక తోలుతున్న ట్రాక్టర్లు వేగంగా వెళ్తుండడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి ట్రాక్టర్లు, ఎండ్ల బండ్లు విపరీతంగా తిరుగుతున్నాయి. పెట్రోలింగ్ చేసే పోలీసులు ఎక్కడా కనిపించడం లేదు. రాత్రంతా తోలకం చేసే ఇసుక ట్రాక్టర్లను అధికారులు ఎందుకు పట్టుకోవడం లేదో అర్థంకావడం లేదు. సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. వాహనాలకు జరిమానాలు వెయ్యవచ్చు కదా. **– అజ్మీరా హోంజీ, కొత్తగూడెం**

### అక్రమ రవాణాను అడ్డుకుంటాం..



ఇసుక కొరత లేకుండా జిల్లాలో గోదావరి ప్రాంతంలో 23 రీచ్‌లకు అనుమతులు ఇచ్చాం. ప్రస్తుతం 10 రీచ్‌లు నడుస్తున్నాయి. అక్రమంగా నడిస్తే వారిని పట్టుకుంటున్నాం. సిబ్బంది లేరు.. అయినా రైడ్‌లు చేస్తున్నాం. వాగుల్లో ఉండే ఇసుక అంతగా నాణ్యత ఉండదు. ఇసుకకు వాగుల్లో అనుమతి ఇస్తే భూగర్భ జలం సమస్య ఉంటుంది. అందువల్ల వాగుల్లో అనుమతి ఇవ్వడం లేదు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు. తహసీల్దార్, పోలీసుల సహకారంతో దాడులు చేసి అక్రమానికి అడ్డుకట్ట వేస్తాం. గోదావరి ఇసుక చాలా నాణ్యమైనది. వాగుల్లో ఇసుక వాడితే నిర్మాణాలకు భవిష్యత్ ఉండదు.

**– దినేష్, మైనింగ్ ఏడీ**

# ప్రశాంతంగా 'పరీక్ష'


కొత్తగూడెంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 25 : కొత్తగూడెంలో గ్రామ పాలనాధికారుల నియామక పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మాజీ వీఆర్వోలు, వీఆర్ఏలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు పరీక్ష రాశారు. మొత్తం 177 మందికి.. 160 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విధులు నిర్వహించారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పరిశీలించారు. పరీక్ష తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# 'ఉస్మానియా'కు 'సింగరేణి' సహకారం

### సీఎస్ఆర్ నిధులతో ఈసీఈ భవన నిర్మాణం

### ప్రారంభోత్సవంలో సింగరేణి సీఎండీ బలరాం


ఓయూ క్యాంపస్‌లోని ఈసీఈ భవనాన్ని ప్రారంభిస్తున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మే 25 : అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఉస్మానియా యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో తరగతి గదుల నిర్మాణానికి సహకరించడం తమ సంస్థకు ఎంతో గర్వకారణంగా ఉందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో సింగరేణి సీఎస్ఆర్ నిధుల కింద నిర్మించిన తరగతి గదుల కాంప్లెక్స్‌ను ఆదివారం ఆయన యూనివర్సిటీ వీసీ కుమార్ మొలుగారంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభించడానికి పూర్తిస్థాయిలో సంస్థ సహకరించిందన్నారు. ప్రస్తుతం మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో సింగరేణి తరపున అధ్యాపకులను కేటాయించిందని, ప్రొఫెసర్ చైర్ పథకం కింద నిధులు కూడా కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, జేఎస్టీ ప్రొఫెసర్ జితేందర్‌కుమార్ నాయక్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ రామ కృష్ణ, సింగరేణి అధికారులు భాస్కర్, రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# గురువులకు 'శిక్ష'ణ

- కనీస వసతులు కల్పించని రాష్ట్ర ప్రభుత్వం
- అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులు
- నేటినుంచి చివరి విడత వృత్యంతర ట్రైనింగ్


వృత్యంతర శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఖమ్మం అర్బన్, మే 25 : ఉపాధ్యాయులకు అందిస్తున్న వృత్యంతర శిక్షణ వారికి చుక్కలు చూపిస్తున్నది. శిక్షణ అందిస్తున్న కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల వసతులు కల్పించి.. మరికొన్నిచోట్ల కల్పించకపోవడంతో ఉపాధ్యాయులు బాహాటంగా విమర్శించడంతోపాటు ఫిర్యాదులు సైతం చేశారు. ఇప్పటివరకు పూర్తయిన మొదటి, రెండో విడత శిక్షణల్లో టీచర్లు పడరానిపాట్లు పడ్డారు. కూర్చునేందుకు సౌకర్యంగా లేని బెంచీలు, టాయిలెట్స్ సమస్యతో మహిళా ఉపాధ్యాయులు శిక్ష అనుభవించారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న మండలానికి చెందిన ఉపాధ్యాయులకు ఖమ్మం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో కల్పించిన శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడ్డారు. విద్యార్థినుల టాయిలెట్స్‌ను వారికి కేటాయించడంతో కొంతపెద్ద వయస్సు, ఆరోగ్యం సహకరించని ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఎండల వేడికి తాళలేక, సరైన తాగునీటి సౌకర్యం, మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేక వాట్సాప్ గ్రూపుల్లో శిక్షణకు హాజరుకాలేమని తమ గోడు వెలిబుచ్చారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణలో అత్యధిక మంది ఉపాధ్యాయులు సౌకర్యాలు లేక సతమతమయ్యారు.

### ఐదురోజులు పూర్తయిన వారికే సర్టిఫికెట్లు..


శిక్షణలో ఐదురోజులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికే హాజరు సర్టిఫికెట్లు ఇస్తున్నారు. స్టేట్‌లో ట్రెజరీ ఐడీ, జిల్లాసాయిలో కేంద్రాల్లో తీసుకున్న హాజరును సరిపోల్చనున్నారు. ఇందుకు శనివారం నిర్వహించిన జూమ్‌లో మార్గదర్శకాలు చేశారు. హాజరును డీఎస్ఈకి పంపించాలని స్పష్టం చేశారు. ఒక్కరోజు హాజరు కాకపోయిన సర్టిఫికెట్ రాదు. అనారోగ్యంతో ఉన్నవారికి మాత్రం డీఈవో పర్మిషన్ ఇచ్చారు. కొంతమందికి ఇతర ఫేజ్‌ల్లో శిక్షణకు అవకాశం ఇచ్చిన సుమారు వంద మందికిపైగా హాజరుకానున్నట్లు విద్యాశాఖాధికారులు గుర్తించారు. జిల్లాలో మొత్తం అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్స్ 2,774, ఎంఆర్‌పీలు 168, జీహెచ్‌ఎంలు 185, స్పెషల్ ఎడ్యుకేటర్స్ 32, ఐఈఆర్‌పీలు 30, ఎస్‌జీటీలు 2,087 మంది ఉన్నారు.

### నేటినుంచి మూడో విడత..

ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు చివరి విడత శిక్షణ నిర్వహించనున్నారు. ఇందుకోసం 5 కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో మూడు ప్రైవేట్ స్కూల్స్ కాగా.. మరో రెండు ప్రభుత్వ స్కూల్స్ ఉన్నాయి. హార్వెస్ట్, న్యూఇరా, న్యూవిజన్ ప్రైవేట్ స్కూల్స్, ఇందిరానగర్, రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు కేంద్రాలుగా ఉన్నాయి. ప్రైవేట్ స్కూల్స్‌లో కొందరికి ఏసీ సౌకర్యం కల్పిస్తుండగా.. మరికొందరికి ఏసీ సౌకర్యం లేదు. వీటితోపాటు ప్రభుత్వ పాఠశాలల ప్రస్తుత పరిస్థితి ప్రభుత్వ ఉపాధ్యాయులకు తెలియనిది కాదు. ట్రైనింగ్ అంటేనే అమ్మో అంటున్నారు. ప్రధానోపాధ్యాయులు, తెలుగు సబ్జెక్ట్ వారికి న్యూఇరా పాఠశాలలో, ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్ వారికి హార్వెస్ట్‌లో, ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులకు న్యూవిజన్‌లో, హిందీ వారికి ఇందిరానగర్ స్కూల్‌లో, ఎస్‌జీటీ ఉర్దూ వారికి రిక్కాబజార్ స్కూల్‌లో శిక్షణ కల్పిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుల్లో ఇన్‌చార్జి ఎంఈవోలుగా ఉన్నవారు, ఎంఈవోలు హైదరాబాద్‌లో ఎంఈవోల శిక్షణకు హాజరుకానున్నారు.

# ఇందిరమ్మా.. ఆంక్షలేందమ్మా?

- ఇంటి నిర్మాణం 400 ఎస్ఎఫ్‌టీకి తగ్గొద్దు..
- 600 ఎస్ఎఫ్‌టీకి మించొద్దు..
- ఒక్క అడుగు పెరిగినా బిల్లులు రావని తేల్చి చెబుతున్న అధికారులు
- సత్తుపల్లి నియోజకవర్గంలో ఆందోళన చెందుతున్న నిరుపేదలు


ఇందిరమ్మ ఇంటి నమూనా

సత్తుపల్లి, మే 25 : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి అధికారులు సవాలక్ష ఆంక్షలు విధిస్తుండడంతో లబ్ధిదారులు నానా హైరానా పడుతున్నారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం అందజేసే రూ.5 లక్షలతోపాటు మరికొంత వేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకుందామని భావించిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా ఉండాలని, ఇందుకు ఇంచు పెరిగినా బిల్లులు ఇచ్చే ప్రసక్తి లేదని తేల్చి చెబుతుండడంతో దిగులు చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు కేటాయించింది. అయితే ఇవి అర్హులకు సరిపోవని, ఇంకా కేటాయించాలని పలు నియోజకవర్గ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించగా.. అర్హులైన ఎంతో మంది నిరుపేదలు వేలల్లో దరఖాస్తు చేసుకోగా.. వారిలో 10 శాతం మందికి కూడా ఇండ్లు దక్కడం లేదు. ఈ క్రమంలో అధికారులు విధిస్తున్న నిబంధనలతో వారి సొంతింటి కల నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న చాలా మంది నిరుపేదలు తమ గుడిసెలు, రేకుల షెడ్లను కూల్చివేసి.. ప్రభుత్వం పైసా ఇవ్వకున్నా బేస్‌మెంట్ లెవల్ వరకు అప్పోసప్పో చేసి పనులు చేపట్టారు. వారం రోజులుగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఇండ్లు మంజూరైన వారికి పట్టాలు అందించడంతో గ్రామాల్లో ముగ్గులు పోసుకొని ఇండ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అయితే కొందరు అదనంగా విస్తరించి ఇంటి నిర్మాణం చేపడుదామనుకున్నా నిబంధనలు విధించడంతో అయోమయానికి గురవుతున్నారు.

### కమిటీల కనుసన్నల్లో లబ్ధిదారుల ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని ప్రకటించింది. అయితే గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు సూచించిన వారికే ఇళ్లను కేటాయించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారు ఇచ్చిన జాబితా ప్రకారమే ఎమ్మెల్యే ఫైనల్ చేయడంతో వారికే ఇండ్లు దక్కినట్లు తెలుస్తోంది. దీంతో అర్హులకు ఇండ్లు దక్కకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించి పారదర్శకంగా ఇండ్లు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

### అర్హులకే కేటాయించాలి..



రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లు గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి. ఇండ్ల కేటాయింపులో రాజకీయం లేకుండా నిజమైన నిరుపేదలకు మంజూరు చేయాలి. ఇప్పటికే చాలా మంది గుడిసెలు, రేకుల షెడ్లు తొలగించుకొని ఎదురుచూస్తున్నారు. ఇండ్ల విషయంలో కమిటీల ప్రమేయం లేకుండా నిరుపేదలకు ప్రభుత్వం న్యాయం చేయాలి.

**–గోదా శ్రీనివాసరావు, వీఎం బంజర, పెనుబల్లి**